క్లుప్తంగా

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి



కార్పొరేటర్ సబిహాబేగంకు సమస్యను వివరిస్తున్న కాలనీ వాసులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు గురువారం కార్పొరేటర్ సబిహాబేగంకు ఆమె కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. నీరు రాక వాటర్ ట్యాంకర్‌లను తెప్పించుకోవల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో నీరు అందే విధంగా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

సత్యసాయి బాబా ఆరాధన మహోత్సవం



విద్యార్థులకు పాదరక్షలు అందజేసిన సాయిబాబా భక్తులు

మోతీనగర్: అనాథలకు, అభాగ్యులకు సేవ చేయడమే శ్రీ సత్యసాయి సేవా సంస్థల కర్తవ్యమని శ్రీ సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ వెంగళరావు నగర్ కన్వీనర్ శ్యాం సుందర్ అన్నారు. గురువారం మూసాపేట డివిజన్, మోతీనగర్ కమిటీ హాల్‌లో శ్రీ సత్యసాయి సేవా సంస్థ మధురానగర్ సమితి ఆధ్వర్యంలో శ్రీ భగవాన్ సత్యసాయి బాబా ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఓంకారం సుప్రభాతం, నగర సంకీర్తన, ఆదర్శ అనాథాశ్రమ విద్యార్థులకు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పాదరక్షలు అందజేశారు. సత్యసాయి అష్టోత్తర పారాయణం, మహా నారాయణ సేవ, అన్నదానం, రుద్ర పారాయణం, భజన, మంగళహారతితో ఆరాధన మహోత్సవం ఘనంగా ముగిసింది.

అభివృద్ధి పనుల్లో భాగస్వాములవ్వాలి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్ తదితరులు

మూసాపేట: అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ కాలనీ సీనియర్ సిటిజన్ భవన్‌కి ఆనుకొని ఉన్న ఎల్‌ఐజీలో ఎమ్మెల్యే సహకారంతో రూ.31 లక్షల నిధులతో రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో డ్రైనేజీ సమస్య ఉండటంతో నూతన డ్రైనేజీ వేయించటం జరిగిందని, అనంతరం రోడ్డు పనులు ప్రారంభించామని తెలిపారు. త్వరలో రోడ్డు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు విజయకుమార్, డివిజన్ అధ్యక్షులు కంచి బిక్షపతి, జనరల్ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి, విజయ్‌కుమార్, ఉమాపతి గౌడ్, సోమయ్య, సాంబశివారెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'హెడ్‌మాస్టర్‌ను అరెస్ట్ చేయాలి'

గచ్చిబౌలి: వేధించడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించిన రాయదుర్గం హెడ్‌మాస్టర్ ఎస్‌కె తాజ్ బాబును అరెస్ట్ చేయాలని కులవివక్ష పోరాట సమితి నాయకులు మాదాపూర్ డీసీపీ వినీత్‌కు వినతిపత్రం అందజేశారు. రాయదుర్గం ప్రైమరీ స్కూల్‌లో ఆయాగా పని చేసే మహిళ తనను వేధించడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించాడని ఫిర్యాదు చేయడంతో రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. బాధితురాలితో కలిసి కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్, శేరిలింగంపల్లి కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు కృష్ణ, రాజు తదితరులు డీసీపీని కలిసిన వారిలో ఉన్నారు.



డీసీపీ వినీత్‌కు వినతిపత్రం అందిస్తున్న సమితి నాయకులు

అసలే ఇరుకురోడ్డు.. ఆపై ట్రాఫిక్ సమస్య

ప్రభుత్వ స్థలం ఉన్నా పీజేఆర్ స్టేడియం వద్ద విస్తరణకు నోచుకోని రోడ్డు | అధికారులకు వినతులు ఇచ్చినా స్పందన కరువు



చందానగర్ పీజేఆర్ స్టేడియం వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డు

చందానగర్ : చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ స్టేడియం నుంచి లింగంపల్లి రైల్వే బ్రిడ్జి వరకు వెళ్లే రహదారి ఇరుకుగా ఉండటంతో స్థానికులు, వాహనదారులకు నిత్యం ట్రాఫిక్ వెతలు తప్పడం లేదు. రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో గచ్చిబౌలి, నానకరాంగూడ వైపు వెళ్లే ఐటీ ఉద్యోగులు ప్రధానంగా చందానగర్, గంగారం, మదీనాగూడలకు చెందిన వాహనదారులు పీజేఆర్ స్టేడియం నుంచి శివాజీనగర్ మీదుగా లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వెళతారు. కానీ పీజేఆర్ స్టేడియం వద్దకు రాగానే ఆ ప్రహరీ కాలనీకి ఆనుకొని ఉండడంతో ఒకసారి ఒక వాహనం మాత్రమే వెళ్లేందుకే వీలు పడుతుంది. దీంతో కార్లు, స్కూల్ బస్సులు రావడంతో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు సతమతం అవుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ, పోలీస్ ఉన్నతాధికారులు రోడ్డు విస్తరణతోపాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

- రోడ్డుపై గుంతలతో ద్విచక్ర వాహనదారులు సతమతం అవుతున్నారు.
- జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు రోడ్డు విస్తరణపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.
- భారీ వాహనాలు రాకుండా కమాన్ ఏర్పాటు చేసినా వాటి వల్ల ప్రమాదకరమని తొలగించారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది.
- ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రోడ్డు విస్తరణ చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.



పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చాం



చందానగర్ పీజేఆర్ స్టేడియం ప్రహరీని 5 అడుగుల మేర జరిపితే రోడ్డు విస్తరణకు అనుకూలంగా ఉంటుంది. రాకపోకలకు ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వ స్థలం కాబట్టి ప్రహరీని తగ్గించవచ్చు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, చందానగర్ ఉప కమిషనర్‌లకు వినతిపత్రాలు అందించా. కానీ పట్టించుకునే అధికారి లేరు.

-రామస్వామి యాదవ్, మాజీ కౌన్సిలర్

ఇరుకు రోడ్డులో ట్రాఫిక్ జామ్



చందానగర్ నుంచి గచ్చిబౌలిలోని కార్యాలయానికి వెళ్లాలంటే పీజేఆర్ స్టేడియం వద్దకు రాగానే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాం. ఈ సమస్య ఉదయం, సాయంత్రం వేళ్లలో ఎక్కువగా ఉంటోంది. చందానగర్‌లో అంతర్గత రోడ్లు చాలా ఇబ్బందికరంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు రోడ్డును విస్తరించాలి.

- శేఖర్, వాహనదారుడు



స్టేడియం నుంచి శివాజీనగర్ రోడ్డు





స్టేడియం ప్రహరీ వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందులు

టాపర్స్‌ను అభినందించిన అడిషనల్ కలెక్టర్



మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల టాపర్స్‌గా నిలిచిన విద్యార్థినులను అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా గురువారం అభినందించారు. జ్యోతి, ఎంపీసీ మొదటి సంవత్సరం 466 మార్కులు, ప్రియాంక, బైపీసీ 990 మార్కులు సాధించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కిషన్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య, విద్యార్థినుల తండ్రులు అనంతయ్య, మనోజ్ పాల్గొన్నారు.

27 నుంచి గీతా సమ్మర్ క్యాంప్

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ఇస్కాన్ ఆధ్వర్యంలో డీఆర్‌ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 27 నుంచి మే 6వ తేదీ వరకు గీతా సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి ఇస్కాన్ అధ్యక్షులు హెచ్.జి. మహా శృంగదాస్ గురువారం పేర్కొన్నారు. 6 నుంచి 15 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లల కోసం కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించామన్నారు. జీవితంలో సవాళ్లను ఎదుర్కొనే నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను అలవర్చే ఉద్దేశంతో ఇస్కాన్ 35 సంవత్సరాలుగా ఈ శిబిరాలను విజయవంతంగా నిర్వహిస్తున్నదన్నారు. శిబిరాల్లో పిల్లలకు మానవీయ విలువలు, వేద సంస్కారాలను బోధిస్తున్నామన్నారు. గౌరవం, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకర జీవనశైలి, కుటుంబ విలువలు, జీవిత నైపుణ్యాల అభివృద్ధి, స్విమ్మింగ్, డ్రాయింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, సంస్కృత శ్లోకాల శిక్షణ, యోగా, సంప్రదాయ నృత్యాలు, గానం మొదలైనవి ఉంటాయన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు తరగతులు ఉంటాయని తెలిపారు. పిల్లలకు బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 96526 75974 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కొండాపూర్ పాఠశాలలో బ్రెజిల్ బృందం

గచ్చిబౌలి: భారతదేశంలో విద్యావిధానం, పట్టణ, గ్రామీణ ప్రాంతాల పరిస్థితులను తెలుసుకోవడానికి వచ్చిన బ్రెజిల్ బృందం కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలను గురువారం సందర్శించింది. తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, బ్రెజిల్ ఎంపీ, విద్యా సలహాదారు లూసియానా, సీజర్‌లు సందర్శించారు. పాఠశాలలో సౌకర్యాలు, బోధనా పద్ధతులు, విద్యార్థుల పరిస్థితి, మౌలిక వసతులు, ఇతర అంశాలను పరిశీలించారు.

స్విగ్గీ డెలివరీ బాయ్‌పై దాడి.. కేసు నమోదు

గచ్చిబౌలి: ఫుడ్ ఆర్డర్‌ను క్యాన్సిల్ చేయడమే కాకుండా మహిళతో గొడవ పడ్డాడంటూ కొందరు యువకులు స్విగ్గీ డెలివరీ బాయ్‌పై విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 23న తెల్లవారుజామున మసీద్‌బండకు చెందిన ఓ మహిళ స్విగ్గీలో ఫుడ్ ఆర్డర్ చేసింది. డెలివరీ బాయ్ రమేష్ లొకేషన్ దొరకకపోవడంతో ఆ పరిసరాల్లోనే తిరుగుతున్నాడు. ఆర్డర్ చేసిన మహిళ బిల్డింగ్ అడ్రస్ చెప్పినా అక్కడకు చేరుకోలేదు. ఈ క్రమంలో మహిళకు, స్విగ్గీ డెలివరీ బాయ్‌కి ఫోన్‌లోనే వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో ఆర్డర్‌ను క్యాన్సిల్ చేసి తాను నివాసం ఉంటున్న చిన్న అంజయ్యనగర్‌లో హాస్టల్‌కు వెళ్లాడు. మహిళ తరఫున యువకులు రంజిత్, మింటు బిస్వాష్, నరేష్, భరత్, రమేష్ హాస్టల్ వద్దకు వెళ్లి డెలివరీ బాయ్‌ను బయటకు తీసుకొచ్చి దాడి చేశారు. హాస్టల్‌లో నివాసం ఉండె వారు డయల్ 100 కాల్ చేయడంతో వదిలేసి వెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిస్టు నాగరాజుకు ఘన నివాళి

ఆల్విన్‌కాలనీ: సీనియర్ జర్నలిస్టు నాగరాజు దశదిన కార్యక్రమం గురువారం నిజాంపేట రోడ్డులో జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి హాజరయ్యారు. నాగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడికి నిరసనగా..



శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో పాల్గొన్న కాలనీవాసులు



మోతీనగర్ చౌరస్తాలో నివాళి అర్పిస్తున్న కాలనీ వాసులు, నాయకులు

మోతీనగర్: ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మోతీనగర్ కో ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షులు నల్లమల అంజిరెడ్డి అన్నారు. యాత్రికులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం రాత్రి మూసాపేట డివిజన్ మోతీనగర్ చౌరస్తాలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉగ్రవాదులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేష్ అయ్యంగార్, టింగిల్కర్ నాగేశ్వరరావు, నాగరాజు, పిట్ల మనోహర్, కె. శ్రీలత, కె. ఆనంద్‌రెడ్డి, మహేష్, సద్గుణరెడ్డి, సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా గాయత్రినగర్ చౌరస్తాలో హిందూ వాహిని ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ వాహిని, బీజేపీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శివాజీయూత్ ఆధ్వర్యంలో..

ఓల్డ్ బోయిన్‌పల్లి: పహల్గాంలో పర్యాటకులపై మంగళవారం జరిగిన ఉగ్రదాడులను ఖండిస్తూ శివాజీ యూత్ ప్రతినిధులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట చౌరాస్తాలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాకిస్తాన్, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాకిస్తాన్ జెండాను దహనం చేశారు. కార్యక్రమంలో కన్నె ప్రకాశ్, చింటు, వర్మ, సురాజ్ సోంకర్, కపిల్, వినయ్ పాల్గొన్నారు.

ఎవరికీ నష్టం కలగకుండా.. చెరువులను అభివృద్ధి చేయాలి



మ్యాప్ ద్వారా చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు, ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: ప్రజలకు, చెరువు ప్రాంతంలో కొనుగోలు చేసిన వారికి, పట్టాదారులకు నష్టం కలుగకుండా నియోజకవర్గంలోని తొమ్మిది చెరువులను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇటీవల ఎమ్మెల్యే హైడ్రా కమిషనర్‌ను కలిసి చెరువులపై మాట్లాడారు. దీంతో గురువారం నియోజకవర్గంలోని నల్ల చెరువు, కాముని చెరువు, సున్నం చెరువు ప్రాంతాల వివరాలను హైడ్రా అధికారులు తెలుసుకున్నారు. మ్యాప్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీడీఆర్ విషయంలో భరోసా ఇచ్చే విధంగా అధికారులతో మాట్లాడి సమస్యను కొలిక్కి తెచ్చినట్లు తెలిపారు. చెరువుల అభివృద్ధి విషయంలో కూడా రాజీ పడే ప్రసక్తే లేదని, అందుకే ఎవరికీ నష్టం కలగకుండా చెరువులను అభివృద్ధి పర్చాలని అధికారులను కోరుతున్నామని పేర్కొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ
- సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1, ఫేజ్ 2, తులసినగర్, శ్రీ తులసినగర్, కాకతీయ నగర్, చంద్రమ్మ బస్తీ, పంచమి కాలనీ, ఉజ్జయిని మహంకాళి నగర్ కాలనీలో రూ.2.8 కోట్ల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

హైదర్‌నగర్ డివిజన్‌లో...

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జలవాయు విహార్, రామ్‌నరేష్ నగర్, అల్లాపూర్ సొసైటీ, మైనార్టీ స్కూల్, విజేత గ్రీన్‌హోమ్స్, కింది కుంట చెరువు నుంచి కొనసీమ వంటిల్లు ప్రాంతం వరకు, హెచ్‌ఎంటీ, శాతవాహననగర్ కాలనీల్లో సుమారు రూ.2.9 కోట్ల అంచనా వ్యయంతో సీసీ రోడ్లకు పీఏసీ చైర్మన్ గాంధీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ అభివృద్ధి పనుల్లో భాగస్వాములవ్వాలన్నారు.

బైకులు చోరీ : నలుగురి రిమాండ్

మూసాపేట: విలాసాలకు అలవాటు పడ్డ నలుగురు స్నేహితులు బైకుల చోరీకి పాల్పడుతున్నారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... విజయవాడకు చెందిన మామిడి తేజ్దీప్ (19) డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ చింతల్‌లో ఉంటున్నాడు. స్టేషన్ ఘనపూర్‌కు దిన తాటికాయల చందు (21) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ చింతల్‌లో ఉంటున్నాడు. మిగతా ఇద్దరు మైనర్‌లు. నలుగురు స్నేహితులు చెడు అలవాట్లకు బానిసై పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలను చోరీ చేసి కూకట్‌పపల్లి పద్మావతి ప్లాజా పార్కింగ్ ప్లేసులో ఉంచేవారు. నవంబర్ 2024 నుంచి ఏప్రిల్ 2025 వరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కూకట్ పల్లి, బాచుపల్లి, దుండిగల్, జగద్గిరి గుట్ట, జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో 9 బైకులను దొంగతనం చేశారు. కూకట్‌పల్లి పోలీసులు, బాలానగర్ జోన్ సీసీఎస్ పోలీసుల సమన్వయంతో సీసీ ఫుటేజీ ద్వారా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 9 బైకులను స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదించిన పోలీసులకు రివార్డు అందజేశారు.

యూపీఎస్సీ ఫలితాల్లో 'ఆర్క్ రిఫ్లెక్షన్స్' విజయదుందుభి



సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల ప్రకటించిన యూపీఎస్సీ సివిల్స్ సర్వీసెస్ ఫలితాల్లో అశోక్ నగర్ లోని 'ఆర్క్ రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ బై మధురామ్' 26 సర్వీసెస్ సాధించిందని ఆర్క్ గ్రూప్ చైర్మన్ గుమ్మి రాంరెడ్డి తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందలోపు 5 ర్యాంకులు సాధించడం, వీళ్లంతా ఐఏఎస్ అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉండడం పట్ల సంతృప్తిగా ఉందన్నారు. వచ్చే 2030 సంవత్సరానికల్లా 100 మంది ఐఏఎస్, ఐపీఎస్ లను దేశానికి అందించడం తమ లక్ష్యంగా వెల్లడించారు, యూపీఎస్సీ ఫలితాల్లో తమ విద్యార్థులు 15, 46, 62, 68, 99, 146, 187, 218, 232, 63, 346, 430, 455, 520, 591, 641, 667, 716, 739, 770, 798, 829, 904, 938, 944, 975 ర్యాంకులు సాధించడం పట్ల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మధుసూదన్, చీఫ్ మెంటార్, డైరెక్టర్ డా.వివేకానంద హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో విజేతలు ప్రీతి (263 ర్యాంక్) సాయి భార్గవ (798 ర్యాంక్) పాల్గొని తమ విజయానికి ఆర్క్ సంస్థ, సిబ్బంది అందించిన తోడ్పాటుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల నిరసన

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌లో గురువారం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల నిరవధిక సమ్మె కొనసాగింది. 6వ రోజు దిష్టిబొమ్మ దహనం చేశారు. కాంట్రాక్ట్ పద్ధతిలో సేవలందిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని తెలిపారు.

